క్లుప్తంగా

జీవనోపాధికి కుట్టు శిక్షణ దోహదం


కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

సుల్తానాబాద్‌: కుట్టు శిక్షణ జీవనోపాధికి దోహదపడుతుందని డీఆర్‌డీవో డీపీఎం నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో సుల్తానాబాద్‌ పట్టణం, మండలం, ఎలిగేడు, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్‌, ఓదెల మండలాల్లోని ఐకేపీ కేంద్రాల మహిళా సంఘాల సభ్యులు 240మంది శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చి వారితోనే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలు కుట్టించి పంపిణీ చేసేందుకు కలెక్టర్‌ కోయ శ్రీహర్ష ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌, కుట్టు మిషన్‌ శిక్షకులు వసుంధర, రజిత తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న ముత్యంరావు

పెద్దపల్లిరూరల్‌: జిల్లాలోని గోదావరిఖనిలో గుడిసెవాసులకు పట్టాలు, అర్హులకు ఇంటి నిర్మాణానికి భూమితో పాటు రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్‌ చేశారు. సోమవారం పెద్దపల్లిలో మాట్లాడారు. మంగళవారం గోదావరిఖనిలో చేపట్టే నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ వస్తారని పేర్కొన్నారు. పెద్దపల్లిలోని కమాన్‌ వద్ద స్వాగతం పలికి బైక్‌ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. నాయకులు అశోక్‌, రవీందర్‌, శ్రావణ్‌, నవీన్‌ తదితరులున్నారు.

షీ టీంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్సై లావణ్య

రామగుండం: అంతర్గాం మండలం కుందనపల్లి కస్తూర్బాగాంధీ విద్యాలయంలో సోమవారం విద్యార్థినులకు షీ టీంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల భద్రత, ఆన్‌లైన్‌ మోసాలు, యాంటీ డ్రగ్స్‌, సైబర్‌క్రైం, లోన్‌యాప్స్‌, ఈవ్‌టీజింగ్‌ తదితర అంశాలపై వివరించారు. విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే 63039 23700 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే సైబర్‌క్రైం హెల్ప్‌లైన్‌ నం. 1930, ఇతరత్రా అభద్రతా భావంగా భావిస్తే టోల్‌ ఫ్రీ నంబర్‌ 100 డయల్‌ చేసి విషయాన్ని తెలియజేస్తే భద్రత కల్పిస్తామని పేర్కొన్నారు. షీ టీం ఇన్‌చార్జి ఎస్సై లావణ్య, సభ్యులు స్నేహలత, సురేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

రామగుండం: అంతర్గాం మండలం ఆకెనపల్లి గ్రామంలో సోమవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌ ఆదేశాల మేరకు ఎన్టీపీసీకి చెందిన రోహిణి ఫౌండేషన్‌, అంతర్గాం పోలీసులు సంయుక్తంగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎస్సై వెంకటస్వామి, కాంగ్రెస్‌ మండల కోఆర్డినేటర్‌ గాదె సుధాకర్‌ తదితరులున్నారు.

రైతులకు సరిపడా ఎరువులు

ధర్మారం: యాసంగిలో రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేయడం జరిగిందని సింగిల్‌విండో చైర్మన్‌ ముత్యాల బలరాంరెడ్డి అన్నారు. నందిమేడారం విండో కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. విండో పరిధిలోని రైతులకు యూరియా, ఎరువులను సకాలంలో అందించుటకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వైస్‌ చైర్మన్‌ సామంతుల రాయమల్లు, డైరెక్టర్లు భరత్‌ స్వామి, దీటి శ్రీనివాస్‌, రూపానాయక్‌, రాజయ్య, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

ఓదెల: ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు గంట రాములుయాదవ్‌ అన్నారు. మండలంలోని గోపరపల్లెలో మొక్కజొన్న, వరిపంటలను సోమవారం పరిశీలించారు. పంటనష్టం ఎకరాకు రూ.50వేల చొప్పున చెల్లించాలన్నారు. రైతులకు పరిహారం అందకుంటే బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో పోరాటాలు తప్పవన్నారు. నాయకులు మద్దెనవేని రవి, కాశవేని నరేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

పొట్టదశ.. నీటి గోస

కళ్లెదుటే ఎండుతున్న పంట
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఆందోళనలో అన్నదాతలు


బొమ్మారెడ్డిపల్లెలో ఎండిపోయిన వరి


కొత్తపల్లిలో ఎండుతున్న వరి

ధర్మారం: కళ్లెదుటే పంట ఎండుతుంటే కర్షకులకు కన్నీళ్లు ఆగడంలేదు. రూ.లక్షలు వెచ్చించి వ్యవసాయ బావుల్లో పూడిక తీయిస్తూ పంటను కాపాడుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. నేలను నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న రైతన్న.. ఆ పంటను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నాడు. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటి వరికి నీళ్లు అందడంలేదు.

కేవలం బావులపై ఆధారపడి..

మండలంలోని కొత్తపల్లి, బొమ్మారెడ్డిపల్లి గ్రామ పరిధిలోని ఆయకట్టుకు శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టు కాలువ నీటి సౌకర్యం లేదు. కేవలం వ్యవసాయ బావులపైనే ఆధారపడి రైతులు పంటలు సాగుచేస్తున్నారు. వానాకాలంలో సరిపడా వర్షాలు కురవలేదు. చెరువులు, కుంటల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. దీంతో యాసంగి పంటలకు నీళ్లు అందడం గగనంగా మారింది. ప్రధానంగా కొత్తపల్లి, బొమ్మారెడ్డిపల్లిలో దాదాపు 600 ఎకరాల్లోని వరి పంట నీళ్లు అందక ఎండిపోతుంది. వరి పైరు ప్రస్తుతం పొట్టదశకు చేరుకుంది. వ్యవసాయ బావుల్లో నీరు కాస్తోకూస్తో ఉన్నా.. ఎండ తీవ్రతతో ఊటలు తగ్గిపోయాయి. పూడిక తీస్తున్నా పంటకు సరిపడా నీరు రావడంలేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఎకరం ఎండిపోయింది



నాకున్న మూడెకరాల్లో వరి వేసిన. ప్రస్తుతం పొట్టదశకు వచ్చింది. నీరు లేక ఎకరం పంట ఎండిపోయింది. ఎండలు ముదిరితే మరో ఎకరం ఎండిపోయే పరిస్థితి ఉంది. పూడిక తీసినా ఫలితం కనిపించడం లేదు.

– రమేశ్‌నాయక్‌, రైతు, కొత్తపల్లి

పెట్టుబడి వచ్చేలా లేదు



నాలుగెకరాల్లోని పంటకు నీళ్లు అందించే వ్యవసాయ బావిలో రెండెకరాలకు కూడా నీళ్లు ఎల్లడంలేదు. రూ.60 వేలు ఖర్చుచేసి పొక్లెయిన్‌తో పూడిక తీయించిన. కొంతలోతు తవ్వించిన. ప్రస్తుతం రెండెకరాలు ఎండిపోయింది.

– మహిపాల్‌రెడ్డి, రైతు, బొమ్మారెడ్డిపల్లి

మెరుగైన వైద్య సేవలందించండి

- మంత్రి శ్రీధర్‌బాబు


క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కోల్‌సిటీ: క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించారు. ఈనెల 22న మంథని–కాటారం రహదారిలోని నాగేపల్లి వద్ద ఆటో బోల్తాపడి 17 మంది మహిళా కూలీలు గాయపడిన విషయం తెలిసిందే. వీరిలో కొందరిని మెరుగైన చికిత్స కోసం గోదావరిఖని సిమ్స్‌ జీజీహెచ్‌ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. క్షతగాత్రులను ఆదివారం రాత్రి మంత్రి పరామర్శించారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, మెరుగైన వైద్యం అందిస్తామని బాధితులకు మంత్రి ధైర్యం చెప్పారు. ఆస్పత్రి ఆర్‌ఎంవో, ఆర్థోసర్జన్‌ రాజుతో మాట్లాడి క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితులపై తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలందించాలని ఆర్‌ఎంవోను ఆదేశించారు.

ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతున్న నాయకులు

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌


మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్‌

గోదావరిఖని: కాంగ్రెస్‌ పాలనలో ఇసుక దోపిడీకి పాల్పడుతూ రూ.2 కోట్లకుపైగా ప్రభుత్వ ఖజానా కొల్లగొట్టారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ ఆరోపించారు. సోమవారం స్థానిక టీబీజీకేఎస్‌ కేంద్ర కార్యాలయంలో మాట్లాడారు. పంటలకు నీరందక ఎండిపోయి రైతులు తల్లడిల్లుతున్నారని, ఎంతోమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్‌ ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. సాధ్యం కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించేందుకు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ 'గోదావరిగోస' పేరుతో పాదయాత్ర నిర్వహిస్తే కొందరు అవహేళనగా మాట్లాడటాన్ని ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి సాగు కోసం నీటిని నిల్వ చేయాలన్నారు. తాగు, సాగు నీటితో తెలంగాణ సస్యశ్యామలం అయ్యే వరకు ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌, నాయకులు కౌశిక్‌హరి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి


సంజీవరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ధర్మారం: త్వరలో జరిగే స్థానికసంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి కోరారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ పటిష్టతకు కృషిచేయాలని సూచించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నం అంజయ్య, మెడవేని శ్రీనివాస్‌, తాడ్వాయి రాంగోపాల్‌రెడ్డి, తీగుల్ల సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మైనార్టీల అభివృద్ధి


ఇఫ్తార్‌ విందులో నాయకులు

సుల్తానాబాద్‌: ముస్లిం మైనార్టీల అభివృద్ధికి అండగా నిలిచింది కాంగ్రెస్‌ పార్టీ అని మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మినుపాల ప్రకాశ్‌రావు, జిల్లా గ్రంథాలయ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్‌ అన్నారు. సోమవారం రాత్రి కాంగ్రెస్‌ నాయకుడు టీకే ప్రభాకర్‌ ఎస్వీఆర్‌ గార్డెన్‌లో ముస్లింలకు ఇఫ్తార్‌ విందు ఇచ్చారు. విండో చైర్మన్‌ శ్రీనివాస్‌, సీనియర్‌ అడ్వకేట్‌ లక్ష్మీరాజం, ఖలీమ్‌ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



రామగిరి: ఐఎన్‌టీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం సెంట్రల్‌ సెక్రటరీగా ప న్నూర్‌ గ్రామానికి చెందిన ఉడుత శంకర్‌యాదవ్‌ ఎన్నికయ్యాడు. సోమవారం మినిమమ్‌ వేజ్‌ బోర్డు చైర్మన్‌ జనక్‌ప్రసాద్‌ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

క్షయపై అవగాహన



ముత్తారంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎలిగేడు/ముత్తారం/గోదావరిఖనిటౌన్‌: వరల్డ్‌ టీబీ డే పురస్కరించుకుని సోమవారం ఎలిగేడు ప్రాథమి క ఆరోగ్య కేంద్రం, ధూళికట్ట, సుల్తాన్‌పూర్‌ గ్రామాల్లో అవగాహన కల్పించారు. మెడికల్‌ ఆఫీసర్‌ నిస్సీక్రిస్టీనా, డాక్టర్‌ సింధూర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ముత్తారం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు అమరేందర్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. వైద్య సిబ్బంది గ్రేసీ మని, రమాదేవి, స్రవంతి, రవళి పాల్గొన్నారు. గోదావరిఖనిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మెడికల్‌ కళాశాల మైక్రో బయాలజీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ఓబులేసు క్షయపై అవగాహన కల్పించారు.

సంక్షిప్త వార్తలు

కల్వచర్ల వాసికి పురస్కారం

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్‌ ఉగాది పురస్కారం అందుకున్నాడు. సర్వేజనా సుఖినోభవంతు 8వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యనారాయణ, హైకోర్టు రిటైర్డ్‌ జడ్జి చంద్రయ్య, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు.

ఖని కళాకారుడికి..

గోదావరిఖనిటౌన్‌: కళాకారుడు, ప్రముఖ ఇంద్రజాలికుడు మేజిక్‌ రాజాకు బిట్‌బిట్‌ డ్యాన్స్‌ అకాడమీ, దేవ కళాబృందం ఆధ్వర్యంలో స్థానిక మార్కండేయకాలనీలోని ఒక ప్రైవేట్‌ ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ మెజీషియన్‌ ఉగాది పురస్కారం అందజేసి సత్కరించారు.

రేపు పశు వైద్య శిబిరం

కాల్వశ్రీరాంపూర్‌: మండలంలోని తారుపల్లిలో ఈనెల 26న పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ రామిడి తిరుపతిరెడ్డి తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఆందోళన

జ్యోతినగర్‌: రామగుండం కార్పొరేషన్‌లోని పలు డివిజన్‌లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతున్నాయా అనే అంశాలపై మంగళవారం బల్దియా కార్యాలయం ఎదుట ఆందోళన చేయనున్నట్లు సీపీఎం నాయకులు తెలిపారు.

కాలువల్లో పూడిక తీయించాలని వినతి

మంథని: మంథని నియోజకవర్గ పరిధిలోని డీ–83 కెనాల్‌లో పూడిక తీయించి పొలాలకు నీరు పారేలా చూడాలని కిసాన్‌ సెల్‌ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్‌రెడ్డి సోమవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో కోరారు. అలాగే రాబోయే వానాకాలం సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన సీడ్‌ విత్తనాలతో పాటు ధాన్యం అందించాలని కిసాన్‌ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడు, సీడ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ అన్వేశ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. మంథని, భూపాలపల్లి మీదుగా లోకల్‌ రైల్‌ నడిచేలా చర్యలు చేపట్టాలని మంత్రికి కాంగ్రెస్‌ నాయకుడు బూడిద తిరుపతి వినతి పత్రం అందించారు.

వంట పాత్రలు పంపిణీ

సుల్తానాబాద్‌: మండలంలోని 37 ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం వంట పాత్రలు పంపిణీ చేసినట్లు ఎంఈవో రాజయ్య తెలిపారు. తమకు వంట పాత్రలు సరఫరా చేయాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు కొన్నేళ్లుగా ఆందోళన చేయడంతో ప్రభుత్వం పంపిణీ చేసినట్లు తెలిసింది.

దరఖాస్తులు ఆహ్వానం

మంథని: వ్యవసాయ యాంత్రికరణ కింద అందించే పరికరాలకు మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని మంథని వ్యవసాయ సహాయ సంచాలకులు అంజని కోరారు. మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఈశ్వరకృప వృద్ధాశ్రమ వార్షికోత్సవం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్‌ వీర్లపల్లిలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమం రెండో వార్షికోత్సవం పురస్కరించుకొని సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వృద్ధాశ్రమంలో 25 మంది వృద్ధులకు సేవలందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. నేటి యువత రేపటి వృద్ధులు అనే విషయాన్ని మర్చిపోయి కర్కశంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సోమారపు సత్యనారాయణ, కోరుకంటి చందర్‌, జిల్లా రెడ్‌ క్రాస్‌ సొసైటీ అధ్యక్షుడు కావేటి రాజగోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

మాటల్లో దింపి.. మాయం చేసి

పెద్దపల్లిరూరల్‌: పట్టగొలుసులు కొనేందుకు వచ్చిన మహిళలు వ్యాపారిని మాటల్లోకి దింపి గొలుసులతో ఉడాయించిన ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. పెద్దపల్లి పట్టణంలోని పైడబజార్‌లో గల ఓ జ్యువెలరీ షాపునకు ముగ్గురు మహిళలు పట్టగొలుసులు కొనేందుకని వచ్చారు. అందులో ఓ మహిళ వెనకవైపు కూర్చుంది. ముందువరసలో ఉన్న ఇద్దరు మహిళలు డిజైన్లు చూస్తున్నట్లు నటిస్తూ రెండు జతల (దాదాపు 30గ్రాముల బరువు) పట్టగొలుసులను కిందపడేయగా వాటిని వెనక ఉన్న మహిళ కాలితో అందుకుని దాచుకున్నట్లు సీసీపుటేజీలో రికార్డయిందని షాపు యజమాని శ్రీనివాస్‌ తెలిపారు. ఈ విషయమై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్‌: మండల కేంద్రంలో గీతకార్మికుడు బిబ్బిలి రాజయ్య సోమవారం సాయంత్రం తాటివనానికి వెళ్తుండగాఎకారు వెనుకనుంచి ఢీకొంది. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌ తరలించారు.

ఆశావర్కర్ల ముందస్తు అరెస్టు


పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆశావర్కర్లు

పెద్దపల్లిరూరల్‌/జూలపల్లి: తమ అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ సోమవారం తలపెట్టిన చలో హైదరాబాద్‌ కార్యక్రమానికి తరలివెళ్తున్న ఆశావర్కర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడంపై సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి తదితర నాయకులు నిరసించారు. అలాగే జూలపల్లి మండలంలో ఆశాకార్యకర్తలను ఎస్సై సనత్‌కుమార్‌ ఆధ్వర్యంలో ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు.

ఓసీపీ–5ని తనిఖీ చేసిన ఆపరేషన్‌ డైరెక్టర్‌


సూచనలు చేస్తున్న ఎల్‌వీ సూర్యనారాయణ

గోదావరిఖని: సింగరేణి ఓసీపీ–5ని సోమవారం ఆపరేషన్‌ డైరెక్టర్‌ ఎల్‌వీ సూర్యనారాయణ తనిఖీ చేశారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెంచే దిశగా తీసుకుంటున్న చర్యలను సమీక్షించి అధికారులకు తగు సూచనలు చేశారు. షావెల్‌ యొక్క పని స్థలాలను పరిశీలించారు. ఎండాకాలంలో తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌, ప్రాజెక్టు ఆఫీసర్‌ చంద్రశేఖర్‌, ప్రాజెక్టు మేనేజర్‌ అనిల్‌ గబలే, సేఫ్టీ ఆఫీసర్‌ పానుగోటి శ్రీనివాస్‌, సర్వేయర్‌ దీటి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–2 ఏరియా స్ట్రక్చరల్‌ కమిటీ సమావేశం


సమావేశంలో జీఎం, కమిటీ సభ్యులు

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్‌ హాల్‌లో అఫిషియేటింగ్‌ జీఎం ఎం.రాముడు ఆధ్వర్యంలో గుర్తింపు సంఘం స్ట్రక్చరల్‌ కమిటీ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఏరియా పరిధిలోని సమస్యలపై జీఎంతో చర్చించారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తామని జీఎం తెలిపారు. కమిటీ సభ్యులు కె.రాజరత్నం, జిగురు రవీందర్‌, బి.శ్యాంసన్‌, జి.సాంబశివరావు, ఎ.రవికుమార్‌, మామిడి మహేందర్‌, అధికారులు నర్సింహారావు, ఎర్రన్న, సంతోష్‌కుమార్‌, ధనుంజయ్‌, ఎస్‌.అనిల్‌కుమార్‌, మురళీకృష్ణ, డేవిడ్‌, డాక్టర్‌ మహిపాల్‌, వేణుగోపాల్‌ పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు బానిస కావొద్దు


నియామకపత్రాలు అందజేస్తున్న నాగేశ్వరరావు

రామగిరి: సింగరేణిలో ఉద్యోగం రావడం ఒక వరమని, చెడు అలవాట్లకు బానిసై విధులకు గైర్హాజరు కావద్దని ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. అడ్రియాల లాంగ్‌వాల్‌ ప్రాజెక్టులోని వివిధ గనులు, విభాగాల్లో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మెడికల్‌ ఇన్వాలిడేషన్‌, మృతి చెందిన ఉద్యోగులకు సంబంధించి సోమవారం నలుగురికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ, సూపర్‌వైజర్ల ఆదేశాలు పాటిస్తూ స్థాయికి తగ్గట్టు అనుక్షణం అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. సీనియర్‌ ఉద్యోగుల సలహాలు, సూచనలు తీసుకొని భవిష్యత్తులో మరెన్నో పదవులు పొందాలని, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రాతినిధ్య సంఘం నాయకుడు కోట రవీందర్‌రెడ్డి, పర్సనల్‌ మేనేజర్‌ బి.సుదర్శనం, డీవైపీఎం సునీల్‌ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగనులు రాకుంటే సంస్థ భవిష్యత్‌ అంధకారం


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్‌

గోదావరిఖని: కొత్తగనులు రాకుంటే సింగరేణి భవిష్యత్‌ అంధకారంగా మారుతుందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్‌ జనక్‌ప్రసాద్‌ పేర్కొన్నారు. సోమవారం జీడీకే–5 ఓసీపీ వద్ద గేట్‌ మీటింగ్‌లో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, వేలాది కుటుంబాల భవిష్యత్‌ ప్రమాదంలో పడే అవకాశముందన్నారు. సింగరేణి బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా అడ్డుకోవడమే కాకుండా, బినామీలకు బొగ్గు గనులు అప్పగించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. సింగరేణి బొగ్గు బ్లాకుల వేలంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరినట్లు వెల్లడించారు. నాయకులు నరసింహారెడ్డి, ధర్మపురి, వికాస్‌ కుమార్‌యాదవ్‌, దాస్‌, సదానందం, శంకర్‌నాయక్‌, గండ్ర దామోదర్‌రావు, గడ్డం కృష్ణ, దశరథం, సమ్మయ్య, జనగామ శ్రీనివాస్‌, బేబీ శ్రీనివాస్‌, మండ రమేశ్‌, పుట్ట రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

యైటింక్లయిన్‌కాలనీ: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని ఎస్‌ఓటూ జీఎం రాముడు అన్నారు. సోమవారం ఫొటో అండ్‌ వీడియోగ్రాఫర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో స్థానిక అబ్దుల్‌ కలాం స్టేడియంలో నిర్వహించి ఫ్రెండ్లీ క్రికెట్‌ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందజేశారు. కాలనీలోని ఫొటో అండ్‌ వీడియోగ్రాగ్రఫర్స్‌ సభ్యులు నాలుగు టీంలుగా ఏర్పడి ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రికెట్‌ పోటీల్లో పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్లక్ష్యం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

గోదావరిఖని: గోదావరినదిని ఎడారిగా మార్చడాన్ని నిరసిస్తూ సోమవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ మాట్లాడుతూ, మాజీ సీఎం కేసీఆర్‌ చేసిన విధంగా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసి చూపించాలన్నారు. కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ నాయకులపై ఫిర్యాదు

సీఎం దిష్టిబొమ్మ దహనం చేసిన బీఆర్‌ఎస్‌ నాయకులపై చర్యలు తీసుకోవాలని సోమవారం కాంగ్రెస్‌ నాయకులు గోదావరిఖని వన్‌టౌన్‌ సీఐ ఇంద్రసేనారెడ్డికి ఫిర్యాదు చేశారు. చిత్తశుద్ధి ఉంటే మేడిగడ్డ బ్యారేజీపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక, కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్‌ నివేదిక ఆధారంగా శాస్త్రీయపరమైన చర్చకు రాకుండా రాజకీయాలు చేయడం కాకుండా, శాస్త్రీయపరమైన చర్చకు రావాలన్నారు. నాయకులు మెంటం ఉదయ్‌రాజ్‌, కౌటం సతీశ్‌, బండి రాము, నజీముద్దీన్‌ పాల్గొన్నారు.


గోదావరిఖని: పూజలు చేస్తున్న జీఎం, నాయకులు


జూలపల్లి: భక్తులకు అన్నదానం

ప్రత్యేక పూజలు.. అన్నదానం

గోదావరిఖని: ఆర్జీ–2 ఓసీపీ–3 సీహెచ్‌పీ దుర్గాదేవి ఆలయ 25వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అఫిషియేటింగ్‌ జీఎం ఎం.రాముడు, యూనియన్‌ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష గోగు పువ్వులతో..

సుల్తానాబాద్‌: పట్టణంలోని శివాలయంలో సోమవారం స్వామివారికి లక్ష గోగు పువ్వులతో ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీ చెన్నకేశ్వరాలయంలో..

రామగుండం: లోక కల్యాణార్థం అంతర్గాం మండలం ముర్మూర్‌లోని శ్రీచెన్నకేశ్వరాలయంలో సోమవారం వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు.

రాజేశ్వరస్వామి సన్నిధిలో..

జూలపల్లి: మండలకేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అర్చకులు ఉద్దండ నవీన్‌ బృందం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ పునర్నిర్మాణ దాత నల్ల మనోహర్‌రెడ్డి, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ పాటకుల అనిల్‌, భక్తులు పాల్గొన్నారు.